## క్లుప్తంగా

### మిస్సింగ్ కేసు ఛేదన

**కుటుంబసభ్యుల చెంతకు మహిళ**

**మంగళగిరి:** నవులూరుకు చెందిన ఓమ్మి లక్ష్మి(32) అదృశ్యమైన కేసును రూరల్ పోలీసులు ఛేదించారు. రూరల్ ఎస్ఐ సీహెచ్ వెంకటేశ్వర్లు గురువారం తెలిపిన వివరాల ప్రకారం దంపతుల మధ్య తలెత్తిన విభేదాల కారణంగా గత నెల 31న లక్ష్మి ఇంటి నుంచి వెళ్లిపోయింది. ఆమె భర్త రమణబాబు ఇచ్చిన ఫిర్యాదుపై దర్యాప్తు చేశారు. లక్ష్మి అనకాపల్లి జిల్లాలోని తన పిన్ని ఇంటిలో ఉన్నట్లు గుర్తించి గురువారం ఆమెను తీసుకొచ్చి నవులూరులోని కుటుంబసభ్యులకు అప్పగించినట్లు తెలిపారు.

### పోషకాహారంతో ఆరోగ్యం



**ఫిరంగిపురం:** పోషకాహారంతో ఆరోగ్యం చేకూరుతుందని అంగన్‌వాడీలు అన్నారు. పొనుగుపాడు ఓసీ ఏరియాలోని అంగన్‌వాడీ సెంటర్‌లో పౌష్టికాహార వారోత్సవాలు గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా గర్భిణులు, బాలింతలకు పోషకాహారం తీసుకునే విధానం వివరించారు. కార్యక్రమంలో ఎంఎస్‌కే మానస, అంగన్‌వాడీలు వై.ఉదయలక్ష్మి, మీరాబీ, లక్ష్మీప్రసన్న, విజయకుమారి, కోటమ్మ తదితరులు పాల్గొన్నారు.

### మహాసభలను జయప్రదం చేయండి



**తాడేపల్లి రూరల్:** విశాఖలో జరగనున్న ఆలిండియా మహాసభలను జయప్రదం చేయాలని సీఐటీయూ నాయకుడు బూరగ వెంకటేశ్వర్లు పిలుపునిచ్చారు. గురువారం తాడేపల్లి పట్టణ పరిధిలోని నెహ్రూబొమ్మ సెంటర్‌లో మున్సిపల్ వర్కర్స్‌తో సమావేశాన్ని నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ విశాఖపట్నంలో డిసెంబర్ 31నుంచి, వచ్చే ఏడాది జనవరి 4 తేదీ వరకు జరగబోయే సీఐటీయూ ఆలిండియా మహాసభలను జయప్రదం చేయాలన్నారు. మున్సిపల్ కార్మికులకు ఇవ్వాల్సిన కొబ్బరి నూనె, సబ్బులు, చెప్పులను మున్సిపల్ అధికారులు వెంటనే అందజేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో కార్మికులు మేరి, నాని, సతీష్, కామాక్షి, రమణ, శ్రీను పాల్గొన్నారు.

### సంక్రాంతి నాటికి అందుబాటులో వెస్ట్ బైపాస్

**మంగళగిరి:** వచ్చే ఏడాది సంక్రాంతి నాటికి వెస్ట్ బైపాస్ అందుబాటులోకి వస్తుందని గుంటూరు ఎంపీ, కేంద్ర గ్రామీణ అభివృద్ధి కమ్యూనికేషన్ సహాయ శాఖ మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ తెలిపారు. గురువారం అధికారులతో కలిసి మండలంలోని చినకాకాని వద్ద నుంచి జరుగుతున్న వెస్ట్ బైపాస్ పనులను ఆయన పరిశీలించారు. స్థానికులకు ఇబ్బంది లేకుండా ఫుట్ ఓవర్ వంతెనకు ప్రణాళికలు రూపొందిస్తారన్నారు. గుంటూరు నుంచి గొల్లపూడి మీదగా హైదరాబాద్, విశాఖపట్నం కనెక్టవిటీకి ఉపయోగపడే వెస్ట్ బైపాస్ అందుబాటులోకి వస్తే విజయవాడతో పలు నగరాల్లో ట్రాఫిక్ ఇబ్బందులు తొలగుతాయని తెలిపారు. కార్యక్రమంలో ఎన్‌హెచ్ఏఐ పీడీ పార్వతీశం, అధికారులు పాల్గొన్నారు.

### మంత్రి లోకేష్ కార్మికుల సమస్యపై స్పందించాలి

**సీఐటీయూ నేత దుర్గారావు**



**తాడేపల్లి రూరల్:** బ్రహ్మానందపురం ఏసీసీ సిమెంట్ ఫ్యాక్టరీ కార్మికుల సమస్యలపై మంత్రి లోకేష్ స్పందించాలని సీఐటీయూ నేత వేముల దుర్గారావు కోరారు. సీపీఎం నేత నరసింహారావు, యూనియన్ నేత కూరపాటి స్టీవెన్‌తో కలసి గురువారం దీక్షా శిబిరాన్ని ఆయన సందర్శించారు. వారు మాట్లాడుతూ కార్మికుల దీక్షలు 289వ రోజుకు చేరుకున్నాయన్నారు. ఎన్నికలకు ముందు నారా లోకేష్ కార్మికులకు ఇచ్చిన హామీని నిలబెట్టుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నేతలు పిచ్చయ్య, గురవయ్య, నాగేశ్వరరావు, సాంబశివరావు కార్మికులు ఇస్మాయిల్, అంకయ్య, హగ్గయ్య, శివకుమారి, సువర్ణకుమారి, నాగమల్లీశ్వరి, అన్నమ్మ తదితరులు పాల్గొన్నారు.

# ఇది రైతు వ్యతిరేక ప్రభుత్వం

- కూటమి పాలనంతా మోసం, దగా
- ఎమ్మెల్సీ మురుగుడు, వైఎస్సార్ సీపీ మంగళగిరి సమన్వయకర్త డీవీఆర్



క్యూ ఆర్ కోడ్‌ను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్సీ మురుగుడు, డీవీఆర్ తదితరులు

**మంగళగిరి టౌన్:** రాష్ట్రంలో ప్రజా, రైతు వ్యతిరేక ప్రభుత్వం కొనసాగుతోందని ఎమ్మెల్సీ మురుగుడు హనుమంతరావు, వైఎస్సార్ సీపీ మంగళగిరి సమన్వయ కర్త దొంతిరెడ్డి వేమారెడ్డి విమర్శించారు. మంగళగిరి నగర పరిధిలోని 27వ వార్డు, టిడ్కో గృహ సముదాయం, రాజీవ్ గృహకల్ప వద్ద గురువారం బాబు ష్యూరిటీ మోసం గ్యారెంటీ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా హనుమంతరావు, డీవీఆర్ మాట్లాడుతూ ఇచ్చిన హామీలను పూర్తిస్థాయిలో నెరవేర్చకుండా కూటమి ప్రభుత్వం ప్రజల్ని మోసం చేస్తోందన్నారు. అన్నదాతలను నట్టేట ముంచిన చంద్రబాబు కూటమి ప్రభుత్వానిది సూపర్ దగా పాలన అని విమర్శించారు. భవిష్యత్తులో ప్రజలే చంద్రబాబు మోసాలను నిరూపిస్తారన్నారు. ప్రజల తరఫున పోరాటానికి పార్టీ శ్రేణులు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. బాబు ఎప్పుడు అధికారంలోకి వచ్చినా రైతులను గాలికి వదిలేసి కార్పొరేట్ కంపెనీలకు దోచిపెట్టే పనిలో నిమగ్నమవుతున్నారని ధ్వజమెత్తారు.

**మోసపూరిత కూటమి మేనిఫెస్టోను వివరిద్దాం**

కూటమి ప్రభుత్వ మోసపూరిత మేనిఫెస్టోను వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు ఇంటింటికీ వెళ్లి వివరించాలని సూచించారు. నాటి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలన, ప్రస్తుత చంద్రబాబు పాలన ఎలా ఉందనేది ప్రజలకు తెలియజేయాలన్నారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వాన్ని అధికారంలోకి తీసుకురావడానికి ప్రతి ఒక్క నాయకుడు, కార్యకర్త కృషి చేయాలన్నారు. పార్టీ బలోపేతానికి నాయకులు, కార్యకర్తలు కలిసి పని చేయాలని పిలుపునిచ్చారు. కూటమి ప్రభుత్వం ప్రజల నమ్మకాన్ని కోల్పోయిందని, జగనన్న పాలనలోనే అన్ని సంక్షేమ పథకాలు అర్హులందరికీ అందాయని గుర్తుచేశారు. వార్డు స్థాయి నుంచే పార్టీని బలోపేతం చేయాలన్నారు. అనంతరం బాబు ష్యూరిటీ మోసం గ్యారెంటీ క్యూ ఆర్ కోడ్ పోస్టర్లను ఆవిష్కరించారు. కార్యక్రమంలో పట్టణ అధ్యక్షులు ఆకురాతి రాజేష్, సీనియర్ నాయకులు మునగాల మల్లేశ్వరరావు, జిల్లా చేనేత విభాగ అధ్యక్షులు ఊట్ల పాలశ్రీనివాసరావు, జిల్లా నాయకురాలు మల్లవరపు సుధారాణి, ఎస్సీ సెల్ అధ్యక్షులు మాతంగి బాబు, పట్టణ మహిళా అధ్యక్షురాలు సంకె సునీత, నాయకులు కొసనం శ్రీనివాసరావు, షేక్ మాబూ, గుంటి రాజ్యలక్ష్మి, కట్టెపోగు భూషణం, ఏసుబాబు, కృష్ణ కిషోర్, నక్కా నాగరాజు, తుమ్మా పద్మ, గోలి సాంబయ్య, ఆరంజ్ ఆంజనేయులు, దామర్ల శివశంకరి, జంజనం సుజాత, బిట్రా వెంకటేశ్వరరావు, దోగిపర్తి శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

# నమ్మించి బంగారంతో పరార్

- పట్టణ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు
- కేసు నమోదు

**మంగళగిరి టౌన్:** బంగారం పనిచేసే ఓ ఇద్దరు వ్యక్తులు నమ్మించి బంగారు వస్తువులు తీసుకుని పరారైన ఘటన మంగళగిరి నగరంలో గురువారం వెలుగులోకి వచ్చింది. సేకరించిన వివరాల ప్రకారం పట్టణ పరిధిలోని రత్నాల చెరువు సూర్యనారాయణనగర్‌కు చెందిన నాగమల్లేశ్వరరావు షరాఫ్ బజార్‌లో గజ్జెల వర్క్ షాపు పెట్టుకున్నాడు. ఆర్డర్లపై బంగారు వస్తువులు తయారు చేసి విక్రయిస్తుంటాడు. ఈ క్రమంలో మంగళగిరికి చెందిన ఓ వ్యక్తి నక్లెస్ తయారు చేయాలని ఆర్డర్ ఇచ్చారు. తయారు చేసిన అనంతరం రాళ్లు అమర్చడానికి అదే ప్రాంతంలో బంగారు పని చేసే అన్నదమ్ములు వెంకట హరీష్ కుమార్, శివవర ప్రసాద్‌లకు ఈనెల 3వ తేదీన నాగమల్లేశ్వరరావు 80 గ్రాముల నక్లెస్ ఇచ్చాడు.

**కాలయాపన చేస్తూ..**

రెండు రోజుల తరువాత నక్లెస్ ఇవ్వమని అడుగగా, ఇంకా పని పూర్తికాలేదని వారు చెప్పారు. రెండు రోజుల తరువాత ఫోన్ చేసి అడుగగా రేపు, ఎల్లుండి అంటూ కాలయాపన చేస్తూ వచ్చారు. ఈ నెల 7వ తేదీన షాపు వద్దకు వెళ్లి చూడగా మూసివేసి ఉండడం గమనించి, అన్నదమ్ముల ఇంటికి వెళ్లి చూడగా వారి ఇంటికి కూడా తాళం వేసి ఉంది. షరాఫ్ బజార్‌మార్కెట్‌లో పలువురిని విచారణ చేయగా ఈ సంవత్సరం జూలై నెలలోనే పలువురు బంగారం పనిచేసే వారి వద్ద బంగారం తీసుకున్నాడని తెలిసింది. వారితో పాటు తానను కూడా మోసం చేసి బంగారంతో పరారైన ఇద్దరు అన్నదమ్ములపై చర్యలు తీసుకోవాలని నాగమల్లేశ్వరరావు మంగళగిరి పట్టణ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. ఈ ఘటనపై పట్టణ పోలీసులు గురువారం కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నారు.

# ట్రాఫిక్ నిబంధనలు ఉల్లంఘిస్తే కఠిన చర్యలు



వాహనచోదకులకు కౌన్సిలింగ్ ఇస్తున్న మంగళగిరి ఎస్ఐ హరిబాబు

**మంగళగిరి టౌన్:** వాహనచోదకులు ట్రాఫిక్ నిబంధనలను ఉల్లంఘిస్తే కఠిన చర్యలు తప్పవని మంగళగిరి ఎస్ఐ హరిబాబు హెచ్చరించారు. మంగళగిరి నగర పరిధిలోని మిద్దె సెంటర్‌లో గురువారం వాహనాలను తనిఖీ చేశారు. వాహన ధ్రువీకరణ పత్రాలు పరిశీలించి సరైన పత్రాలు లేని వారికి జరిమానా వేశారు. ఈ సందర్భంగా హరిబాబు మాట్లాడుతూ సరైన ధ్రువీకరణ పత్రాలు లేకపోతే కఠిన చర్యలు తప్పవన్నారు. మైనర్లకు వాహనాలు ఇవ్వొద్దని, వారి సరదాల కోసం ప్రాణాల మీదకు తెచ్చుకోవద్దని సూచించారు. మైనర్లు ఎవరైనా వాహనం నడుపుతూ పట్టుబడితే వాహనం ఇచ్చిన తల్లిదండ్రులపై ఎం.వి. యాక్ట్ ప్రకారం చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. రాంగ్ రూట్‌లో వచ్చినప్పుడు ప్రమాదాలు జరిగితే కనీసం ఇన్సూరెన్స్ కూడా రాదని, కొంతమంది సెల్‌ఫోన్లు మాట్లాడుతూ డ్రైవింగ్ చేస్తున్నారని, అలా చేస్తే ప్రమాదాలు జరిగే అవకాశం ఉందన్నారు. రోడ్డుప్రమాదాలపై అవగాహన కల్పించేందుకు పట్టణంలో పలు ప్రాంతాల్లో బోర్డులు ఏర్పాటు చేస్తామన్నారు. ద్విచక్రవాహన చోదకుడితో పాటు వెనుక కూర్చున్న వ్యక్తి తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలన్నారు.

# పీఆర్సీ ప్రకారం జీతాలు ఇవ్వండి



ఎంటీఎంసీ కార్యాలయం ఎదుట ధర్నా చేస్తున్న మున్సిపల్ కార్మికులు

**మంగళగిరి టౌన్:** మున్సిపల్ కార్మికులకు పీఆర్సీ ప్రకారం జీతాలు చెల్లించాలని సీఐటీయూ నాయకులు డిమాండ్ చేశారు. మంగళగిరి నగర పరిధిలోని ఎంటీఎంసీ కార్యాలయం ఎదుట ఏపీ మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయీస్ ఫెడరేషన్, మంగళగిరి తాడేపల్లి సంస్థ కమిటీ ఆధ్వర్యంలో గురువారం ధర్నా జరిగింది. ఈ సందర్భంగా సీఐటీయూ నాయకులు మాట్లాడుతూ జూలై నెలలో జరిగిన సమ్మె కాలానికి ప్రభుత్వం జీతాలు చెల్లిస్తామని ప్రకటించినా ఇప్పటికీ ఇవ్వలేదని తెలిపారు. సమ్మె సందర్భంగా కార్మికులకు ఇచ్చిన హామీలను ప్రభుత్వం వెంటనే అమలు చేయాలని కోరారు. పారిశుద్ధ్య, ఇంజినీరింగ్ కార్మికులు సంక్షేమ పథకాలను అమలు చేయాలన్నారు. పదేళ్ల సర్వీస్ ఉన్నవారు ఉద్యోగ విరమణ ఇస్తే 75 వేల ఆర్థిక సాయం, దహన సంస్కారాలకు ఇచ్చే మొత్తాన్ని రూ.20 వేలకు పెంచడం, ఎక్స్‌గ్రేషియా 5 లక్షల నుంచి 7 లక్షల వరకు పెంచడం, పర్మినెంట్ ఉద్యోగులకు డీఏ బకాయిలు, సరెండర్ లీవ్స్, ఎన్‌క్యాష్‌మెంట్ వంటి హామీలకు ఉత్తర్వులు జారీ చేయలేదని విమర్శించారు. అనేకసార్లు మంత్రులకు, అధికారులకు వినతిపత్రాలు అందజేసినా సమస్యలు పరిష్కారం కావడం లేదన్నారు. అనంతరం అడిషనల్ కమిషనర్ శకుంతలకు వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా నేత రవి, జవహర్‌లాల్, పట్టణ కార్యదర్శి బాలాజీ, తాడేపల్లి నాయకులు కృష్ణ పాల్గొన్నారు.

### వైద్యశిబిరాలను వినియోగించుకోండి



**నూతక్కి(మంగళగిరి):** వైద్య శిబిరాలను ప్రజలు వినియోగించుకోవాలని నూతక్కి పీహెచ్‌సీ మెడికల్ ఆఫీసర్ లక్ష్మీనారాయణ కోరారు. నగర పరిధిలోని నూతక్కి పీహెచ్‌సీలో గురువారం స్వస్థ నారీ స్వశక్తి పరివార్ అభియాన్ శిబిరం నిర్వహించి రోగులకు పరీక్షలు చేసి మందులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మెడికల్ ఆఫీసర్ మాట్లాడుతూ వైద్య శిబిరంలో ఎయిమ్స్ వైద్యులు పాల్గొని జనరల్ మెడిసిన్‌తో పాటు వివిధ రకాల రోగులకు ప్రత్యేక పరీక్షలు నిర్వహించి మందులు అందజేశారన్నారు. కార్యక్రమంలో ఆప్తామిక్ ఆఫీసర్ ఎస్.శివరామకృష్ణ, కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ ఎం. వెంకట రమణ, పబ్లిక్ హెల్త్ నర్స్ విజయలక్ష్మి, హెల్త్ సూపర్‌వైజర్ సతీష్ బాబు, బి బుల్లమ్మాయ్ పాల్గొన్నారు.

### గ్రామ రెవెన్యూ సహాయకుల నిరసన

**తెనాలి రూరల్:** స్థానిక తహసీల్దార్ కార్యాలయం వద్ద గ్రామ రెవెన్యూ సహాయకుల సంఘం ఆధ్వర్యంలో గురువారం ధర్నా నిర్వహించారు. తమ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ వీఆర్ఏలు నినాదాలు చేశారు. కనీస వేతనం రూ. 21 వేలు ఇవ్వాలని, నామినీగా పనిచేస్తున్న వీఆర్ఏల వారసులను రెగ్యులర్ చేయాలని, పే స్కేల్ అమలు చేయడంతో పాటు అర్హులైన వారికి పదోన్నతులు కల్పించాలని డిమాండ్ చేశారు. నాయకులు రాజేష్, కిరణ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

# తుళ్లూరు పీహెచ్‌సీలో ఆకస్మిక తనిఖీ

**సేవలపై కలెక్టర్ ఆరా**



తుళ్ళూరు పీహెచ్‌సీని తనిఖీ చేస్తున్న కలెక్టర్ తమీమ్ అన్సారియా

**తాడికొండ:** తుళ్లూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని కలెక్టర్ ఏ తమీమ్ అన్సారియా గురువారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. సిబ్బంది హాజరు వివరాలను రిజిస్టర్‌లో తనిఖీ చేశారు. హాజరు బాగుండటంతో సంతృప్తి వ్యక్తం చేశారు. మందుల నిల్వలు, ట్యాబ్లెట్స్, ఇంజక్షన్‌లు వాడకం, కాల పరిమితి వివరాలు పరిశీలించారు. అక్కడ చికిత్స పొందుతున్న వారితో ముఖాముఖి మాట్లాడి అందుతున్న సేవలపై ఆరా తీశారు. రాత్రి సమయంలో సెక్యూరిటీ ఉంటే బాగుంటుందని, సామాజిక ఆస్పత్రి స్థాయికి పెంచాలని స్థానికులు కోరారు. వైద్య సేవలు 24 గంటలూ అందుబాటులోకి వస్తే బాగుంటుందని స్థానికులు కోరగా, కలెక్టర్ చర్యలు తీసుకుంటాన్నారు. ఖాళీ పోస్టుల భర్తీకి కృషి చేస్తామన్నారు. వ్యాధులు ప్రబలకుండా ప్రజలు సహకరించాలని కోరారు.

# 'వైర్‌లెస్ కమ్యూనికేషన్' అభివృద్ధి



మాట్లాడుతున్న డాక్టర్ కొల్లా శ్రీనివాసరావు

**మోతడక(తాడికొండ):** అభివృద్ధి చెందుతున్న వైర్‌లెస్ కమ్యూనికేషన్ రంగంలో సమర్థమైన సిగ్నల్ ట్రాన్స్‌మిషన్, రిసెప్షన్ నిర్ధారించడంలో యాంటెన్నా రూపకల్పన, నాప్టిమైజేషన్ కీలక పాత్ర పోషిస్తుందని చలపతి ఇంజినీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కొల్లా శ్రీనివాసరావు అన్నారు. గురువారం మోతడక చలపతి ఇంజినీరింగ్ కళాశాలలో ఐఈటీఈ స్టూడెంట్ చాప్టర్ ఈసీఈ విభాగం ఆధ్వర్యంలో అక్యూర్ టెక్నాలజీ సహకారంతో నిర్వహించిన 'యాంటినా డిజైన్, రేడియేషన్ అనాలసిస్'పై జరిగిన శిక్షణలో ఆయన ప్రసంగించారు. హెచ్ఎఫ్ఎస్ఎస్ సాఫ్ట్‌వేర్ ద్వారా యాంటినా రూపకల్పన, 3డీ ఎలక్ట్రోమాగ్నటిక్ సిమ్యులేషన్, రేడియేషన్ అనాలసిస్‌పై వర్క్‌షాప్‌లో వివరించినట్లు ఆయన తెలిపారు. కళాశాల డీన్‌లు డాక్టర్ పి.బాల మురళీకృష్ణ, వీవీ సుబ్బారావు, విభాగాధిపతి డాక్టర్ నాగ రవికిరణ్, తదితరులు పాల్గొన్నారు.

# కృత్రిమ మేధస్సుపై కార్యశాల



మాట్లాడుతున్న ప్రసన్నకుమార్

**మంగళగిరి టౌన్ :** మంగళగిరి పరిధిలోని వీజే డిగ్రీ కళాశాలలో గురువారం కృత్రిమ మేధస్సుపై కార్యశాల (వర్క్‌షాప్) నిర్వహించారు. శుక్రవారం కూడా జరుగుతుందని కళాశాల సెక్రటరీ, కరస్పాండెంట్ ప్రగడ రాజశేఖర్ తెలిపారు. ముఖ్య అతిథిగా యుఎస్‌ఎలోని కాప్ జెమినిలో అసోసియేట్ డైరెక్టర్‌గా పనిచేస్తున్న వి. ప్రసన్న కుమార్ హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ అనేది మిషన్లలో మానవ మేధస్సు అనుకరణను సూచిస్తుందన్నారు. ఏఐ భాషా నమూనాగా స్వీకరించే ప్రశ్నలకు ప్రతిస్పందనలు రూపొందించడానికి వివిధ ఏఐ సాంకేతికతలను ఉపయోగిస్తున్నారని పేర్కొన్నారు. ఏఐ పరిశ్రమలను ఎలా విప్లవాత్మకంగా మారుస్తుంది, ట్రెండ్లు, అప్లికేషన్ల వంటి అంశాలను వివరించారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ నాదెండ్ల శ్రీనివాసరావు, జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ సత్యనారాయణ అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# క్రమం తప్పకుండా అంగన్‌వాడీ కేంద్రాలకు పంపాలి



ర్యాలీని ప్రారంభిస్తున్న తాడికొండ సర్పంచ్ తోకల సరోజిని

**తాడికొండ:** అంగన్‌వాడీ కేంద్రాలకు చిన్నారులు క్రమం తప్పకుండా వచ్చేలా చూడాలని, వారిలో పోషకాహార లోపాలు గుర్తించి సరిచేసేందుకు దోహదపడుతుందని తాడికొండ సర్పంచ్ తోకల సరోజిని అన్నారు. పోషకాహార మాసోత్సవాల్లో భాగంగా గురువారం నిర్వహించిన సుపోషిత్ భారత్– సక్షం భారత్ కార్యక్రమానికి ఆమె ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో ఐదేళ్లలోపు చిన్నారులందరికీ ఎత్తు, బరువు చూసి బరువు తక్కువగా ఉన్న పిల్లలకు పోషకాహారం సూచిస్తారన్నారు. సూపర్‌వైజర్ కె.కృష్ణకుమారి మాట్లాడుతూ ఊబకాయం నుంచి రక్షణ పొందడానికి తల్లులు చిరుధాన్యాలు, ఆకుకూరలు, పాలు, పండ్లు, డ్రైఫ్రూట్స్ సమపాళ్లలో అందజేస్తే రక్తహీనతను నివారించవచ్చన్నారు. గర్భిణులు, బాలింతలు పౌష్టికాహారంతోపాటు వ్యాధి నిరోధక టీకాలు వేయించుకోవాలన్నారు. కార్యక్రమంలో హెచ్‌వీ శివకుమారి, డాక్టర్ షేక్ షాహినా, పలువురు సిబ్బంది పాల్గొన్నారు.

# డీసీఎంఎస్ గోదాములో అందుబాటులో ఎరువులు

**తాడికొండ:** తాడికొండలో డీసీఎంఎస్ స్టాక్ పాయింట్ గోదాములో రైతులకు అందుబాటులో 20-20-0-15, 400 బస్తాలు, 10-26-20 ఎరువు 400 బస్తాలు అందుబాటులో ఉన్నట్లు ఇన్‌చార్జి ఎస్.మురళి తెలిపారు. రైతులకు ఎరువుల కొరత తీర్చేందుకు తాడికొండ వ్యవసాయ మార్కెట్ యార్డులోని గోదాములో స్టాక్ పాయింట్‌ను అందుబాటులోకి తీసుకొచ్చారన్నారు. ఇప్పటి వరకు స్టాక్ పాయింట్ ద్వారా రైతులకు అవసరమైన యూరియా 85 టన్నులు, డీఏపీ 800 బస్తాలు అందించామని తెలిపారు.

### కంప్యూటర్ పరిజ్ఞానంతో ఉపాధి

**దుగ్గిరాల:** విద్యార్థులకు కనీస కంప్యూటర్ పరిజ్ఞానం ఉండాలని అప్పుడే ఉపాధి దొరుకుతుందని నాగరాజు అన్నారు. గురువారం దుగ్గిరాల మండల కేంద్రంలో జెడ్పీ బాలికల ఉన్నత పాఠశాలలో అమలవుతున్న కంప్యూటర్ ఎడ్యుకేషన్‌ను చైతన్య సారథి ట్రస్టు డైరెక్టర్ ఆపరేషన్స్ నాగరాజు పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ విద్యార్థులు కంప్యూటర్ పరిజ్ఞానాన్ని మరింత పెంచుకోవాలన్నారు. ఉన్నత స్థానాలకు చేరాలంటే సాంకేతిక పరిజ్ఞానం పెంచుకోవాలని సూచించారు. హెచ్ఎం శోభాదేవి, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

### రాష్ట్ర స్థాయి ఫుట్‌బాల్ పోటీలకు విద్యార్థినులు

**ప్రత్తిపాడు:** రాష్ట్ర స్థాయి అండర్–19 ఫుట్‌బాల్ పోటీలకు ప్రత్తిపాడు హైస్కూల్ విద్యార్థినులు ఎంపికయ్యారు. ఈ నెల 17వ తేదీన స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో నందిగామ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో అండర్–19 ఫుట్‌బాల్ సెలక్షన్లు ఉమ్మడి గుంటూరు జిల్లా స్థాయిలో జరిగాయి. ఈ ఎంపికల్లో ప్రత్తిపాడు భవనం వెంకటరెడ్డి జెడ్పీ హైస్కూల్ విద్యార్థినులు సీహెచ్ రాఘవ, కె.పూర్ణిమ ఉత్తమ ప్రతిభ కనబరిచి ఉమ్మడి గుంటూరు జిల్లా జట్టుకు ఎంపికయ్యారు. వీరు ఈ నెల 22 నుంచి 24 వరకు కర్నూలులో జరగనున్న అండర్–19 స్టేట్ లెవల్ పోటీల్లో జిల్లా జట్టుకు ఆడనున్నట్లు హెచ్ఎం షేక్ అలీషా తెలిపారు. ఈ సందర్భంగా గురువారం పాఠశాలలో విద్యార్థినులను, వారికి తర్ఫీదునిచ్చిన పీఈటీ షేక్ కరిముల్లాను పాఠశాల కమిటీ చైర్మన్ అబ్దుల్ రవూఫ్, హెచ్ఎం అలీషా అభినందించారు.

# గోసేవ.. గోవిందుడి సేవతో సమానం

**బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్**



**పెదవడ్లపూడి(మంగళగిరి):** గోసేవ గోవిందుడి సేవతో సమానమని, గోవును జాతీయ జంతువుగా ప్రకటించాలని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్ డిమాండ్ చేశారు. గుంటూరు జిల్లా పెదవడ్లపూడి సాయిబాబా మందిరాన్ని గురువారం సందర్శించిన మాధవ్‌కి మందిరం చైర్మన్ పాతూరి నాగభూషణం స్వాగతం పలికారు. అనంతరం ఆలయ ప్రాంగణంలో గోశాలను సందర్శించిన మాధవ్ మాట్లాడుతూ పితృకార్యాల మాసంలో సకల దేవతలు నిలయమైన గోశాలను సందర్శించి గోవులను పూజించడం వాటికి ఆహారం పెట్టడం అదృష్టమన్నారు. కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పావని, ఎన్టీఆర్, వెస్ట్‌గోదావరి జిల్లాల అధ్యక్షులు ఎ.శ్రీరామ్, ఐ శ్రీదేవి, గోశాల కన్వీనర్ పాతూరి శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.